## హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 3 : లింగాపూర్ హెడ్ కానిస్టేబుల్ గణేశ్ నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి పోలీస్ కో–ఆపరేటివ్ సొసైటీ ద్వారా రావాల్సిన రూ.1.65 లక్షల చెక్కును మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బాధిత పోలీస్ కుటుంబాలకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, జిల్లా పోలీస్ కో ఆపరేటివ్ సొసైటీ కో–ఆర్డినేటర్ జఫరుద్దీన్, ఆర్ఐ ఎంటీ అంజన్న పాల్గొన్నారు.

**మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం..**

మహిళలు, చిన్నారుల రక్షణే పోలీస్ శాఖ తొలి ప్రాధాన్యమని ఎస్పీ డీవీ శ్రీనివాస రావు తెలిపారు. షీ టీం ద్వారా జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, హింసకు గురైతే నిర్భయంగా షీ టీంను సంప్రదించాలని సూచించారు. ఆసిఫాబాద్ డివిజన్ షీ టీం నంబర్ 87126 70564, కాగజ్‌నగర్ డివిజన్ షీ టీం నంబర్ 87126 70565 గానీ, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## నీటి సంరక్షణ కోసం జల్ సంచాయ్

నస్పూర్, జూన్ 3 : జల సంరక్షణ కార్యక్రమాన్ని జాతీయ ప్రాధాన్యతగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం జల్ సంచాయ్ జన్ భగీదారి కార్యక్రమం ద్వారా కృషి చేస్తున్నదని జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అన్నారు. న్యూఢిల్లీ నుంచి మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు, నీటి నిర్వహనలో సమాజ ప్రమేయం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రజలు నీటిని పొదుపు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. తాగునీటి వనరుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## మహిళా సంఘాల అభివృద్ధికే సోలార్ ప్లాంట్లు

మందమర్రి రూరల్, జూన్ 3 : మహిళా సంఘాల అభివృద్ధి కోసమే సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంచిర్యాల డీఆర్డీవో కిషన్ అన్నారు. మండలంలోని ఆదర్శ (మోడల్) పాఠశాలలో మంగళవారం దండేపల్లి, మందమర్రి మండలాలకు సంబంధించిన మహిళా సంఘాల సభ్యులతో సోలార్ పవర్ ప్లాంట్ నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలపడితే గ్రామీణ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతమయ్యే అవకాశం ఉంటుందన్నారు. మహిళా సంఘాలకు ఆర్థిక చేయూతనివ్వడం ద్వారా పారిశ్రామికవేత్తలుగా అవుతారని పేర్కొన్నారు. అనంతరం పాల చెట్టు సమీపంలోని సింగరేణి సోలార్ ప్లాంట్ వద్ద మహిళలకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో రాజేశ్వర్, డీపీఎం స్వర్ణలత, సంజీవ్, ఏపీఎం లలితకుమారి, బ్రహ్మయ్య, సీసీలు చారి, మోహన్, సునీత, వీవోఏలు పాల్గొన్నారు.

## బాలికల సంరక్షణలో ఉపాధ్యాయులు కీలకం

నస్పూర్, జూన్ 3 : బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మంచిర్యాల జిల్లా విద్యా సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ చౌదరి పేర్కొన్నారు. మంచిర్యాలలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం కేజీబీవీ, మోడల్ స్కూల్, అర్బన్ రెసిడెన్షియల్, టీఎస్ఆర్ఐఎస్ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ రెండు రోజులు ఉంటుందన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతో పాటు, మానవతా విలువలు నేర్పించాలని, మైనర్లకు వ్యక్తిగత శుభ్రత, శరీర పెరుగుదల మార్పులు, దాని పర్యావసనాలు గురించి ఉపాధ్యాయులు వివరించాలని సూచించారు. శిక్షణ కో ఆర్డినేటర్ యశోదర, క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, ప్రజ్వల సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ మహ్మద్ సిరాజ్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

నస్పూర్, జూన్ 3 : వర్షాకాలం సమీపిస్తున్నందున మంచిర్యాల జిల్లాలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్‌తో కలిసి మంగళవారం గూగుల్ మీట్ ద్వారా పంచాయతీ రాజ్, మున్సిపల్, సంక్షేమ, వెనకబడి తరగతుల, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ జ్వరం బాధితులకు తమ పరిధిలోనే వైద్య సేవలు అందించాలని, రక్త పరీక్ష కిట్లు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆశ, ఆరోగ్య కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి ఫ్రైడే డ్రైడే నిర్వహించి, నివాసాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయాలని, వసతి గృహాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని దవాఖానల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేసి ప్రజలకు వైద్య సేవలందించాలన్నారు. వైద్య శాఖ ప్రోగ్రాం అధికారులు, యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

**విత్తన వినియోగంపై అవగాహన కల్పించాలి**

వానకాలం పంటల సాగులో రైతులకు విత్తన వినియోగంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయాధికారి కల్పనతో కలిసి వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కొనుగోలు, వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఫర్టిలైజర్ దుకాణాల యాజమానులు నాణ్యమైన అనుమతి ఉన్న విత్తనాలు, ఎరువులు విక్రయించాలని సూచించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణం పూర్తి చేయండి



ఆందోళన చేస్తున్న వారికి నచ్చచెబుతున్న ఎస్ఐ విక్రమ్

దహెగాం, జూన్ 4 : దహెగాం మండలం ఐనం జీపీ పరిధి పోలంపల్లి గ్రామానికి నిర్మిస్తున్న రోడ్డు పనులు పూర్తిచేయాలని పోలంపల్లి, ఐనం గ్రామస్తులు మంగళవారం దహెగాం, కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఐటీడీఏ నిధులతో ప్రారంభమైన రోడ్డు నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది, ఈ విషయాన్ని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో అసంపూర్తి రోడ్డు పూర్తిగా బురదమయమై గ్రామానికి రాకపోకలు కష్టసాధ్యమవుతాయని వారు వివరించారు. అధికారులు వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేపడుతున్న సమాచారం అందుకున్న ఎస్ఐ విక్రమ్ అక్కడికి చేరుకుని ధర్నా చేస్తున్న వారికి నచ్చచెప్పి విరమింపజేశారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దహెగాం, జూన్ 3 : వర్షాకాలం నేపథ్యంలో వరదలు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి సిబ్బందికి సూచించారు. దహెగాం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ముందుగా పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వరదల వల్ల తీసుకోవాల్సిన జాగ్రతల గురించి వివరించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీడీవో ఆల్బర్ట్, ఎస్ఐ విక్రమ్, ఎంపీవో రవికుమార్, ఏపీఎం చంద్రశేఖర్, ఏపీవో కల్పన, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఇనోస్, ఏఈ ఆత్మారాం పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్, జూన్ 3 : పెంచికల్‌పేట్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పంచాయతీ కార్యదర్శులతో డీపీవో భిక్షపతి సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో ఆల్బర్ట్, తహసీల్దార్ పుష్పలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బాధ్యతలు

నస్పూర్, జూన్ 3 : జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిగా ఆ సహకార సంస్థ ఈడీ చాతరాజుల దుర్గా ప్రసాద్ పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన, కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి, మొక్కను అందజేశారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడిగా పనిచేసిన పోటు రవీందర్‌రెడ్డి మే 31న విరమణ పొందారు.

## 'బడి బాట' పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 3 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 6 నుంచి 19వ తేదీ వరకు చేపట్టనున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం డీఈవో యాదయ్యతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీసీఈవో లక్ష్మీనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అలాగే ఆసిఫాబాద్‌లోని వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన నూతన వాటర్ ఫిల్టర్‌ను అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం పొరుగు సేవల పద్ధతిలో ఎంపికైన వారి ధ్రువపత్రాలు పరిశీలించారు. వైద్య విద్యార్థులతో మాట్లాడుతూ.. కళాశాలలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే స్పందించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సీతారాం, జిల్లా దవాఖాన పర్యవేక్షకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సింగరేణి జీఎంలతో సీఎండీ సమీక్ష

శ్రీరాంపూర్, జూన్ 3 : సింగరేణిలోని 12 ఏరియాల్లోని సమస్యలు, వాటికి సంబంధించి పరిష్కారాలపై కొత్తగూడెంలోనే హెడ్డాఫీస్‌లో అన్ని ఏరియాల జీఎంలతో సీఎండీ బలరాం సుదీర్ఘంగా సమీక్షించారు. సింగరేణి భవిష్యత్‌కు బంగారు బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. ప్రస్తుత గనుల పరిస్థితి, భవిష్యత్‌లో చేపట్టబోయే గనుల సాధనకు అవలంబించాల్సిన కార్యాచరణ, కంపెనీ విస్తరణ, సమస్యలు, వాటి పరిష్కారంలో ఏరియా జీఎంలు పోషించాల్సిన పాత్రను వివరించారు. నూతన గనులు లేకపోతే ఇల్లెందు, మణుగూరు, బెల్లంపల్లి తదితర ఏరియాలకు భవిష్యత్ ఉండదని, నూతన గనుల కోసం కూడా ప్రయత్నాలు సాగించాలన్నారు. ముఖ్యంగా అటవీ అనుమతుల సాధనలో జాప్యం జరుగకూడదని పేర్కొన్నారు. ఉద్యోగులు యంత్రాలతో షిఫ్ట్‌లో పూర్తి పనిగంటలు పనిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని, విధులపై నిర్లక్ష్యంగా ఉండే వారిని తొలగించాలని ఆదేశించారు. గైర్హాజరు శాతాన్ని గణనీయంగా తగ్గించాలని సూచించారు. నైనీలో బొగ్గు ఉత్పత్తిపైనా సమీక్షించారు. బొగ్గు రవాణా సాఫీగా చేయాలన్నారు. డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్, పర్సనల్) వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్‌డీఎం సుభాని, జనరల్ మేనేజర్ సీపీపీ ఏ మనోహర్, ఏరియాల జీఎంలు, కార్పొరేట్ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

## 100 రోజుల ఇంటిగ్రేటెడ్ వైద్య శిబిరాలు

మంచిర్యాల అర్బన్, జూన్ 3 : మంచిర్యాల జిల్లాలో 100 రోజులపాటు ఇంటిగ్రేటెడ్ వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జరుగుతుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీశ్ రాజ్ అన్నారు. పాత మంచిర్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జాతీయ క్షయ నివారణ, హెచ్ఐవీ ఎయిడ్స్, అసంక్రమణ వ్యాధులు హెపటైటిస్, బీపీ తదితరాలపై పరీక్షలు చేసి, ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. వారంలో నాలుగు రోజులపాటు నెలకు 16 రోజులు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేశ్, వైద్యులు సుధాకర్ నాయక్, ప్రసాద్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శివ ప్రతాప్, అమర్, రాము, రజిత, వెంకటేశ్వర్లు, అల్లాడి శ్రీనివాస్, రామ్మూర్తి, నీలిమ, ప్రశాంతి, సురేందర్, లక్ష్మణస్వామి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, డెమో బుక్క వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## హరీశ్‌రావు ఫ్లెక్సీల తొలగింపు హేయమైన చర్య

జన్నారం, జూన్ 3 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అధికారులకు చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి తొలగించడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మల విజయధర్మ మండిపడ్డారు. ఈ సందర్భంగా జన్నారంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫ్లెక్సీల తొలగింపును బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. ఇలాంటి చిల్లర పనులు చేయడం కాంగ్రెస్ నాయకులు మానుకోవాలని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం నేర్చుకోవాలని సూచించారు.

## పథకం ప్రకారమే మహిళ హత్య

మంచిర్యాల అర్బన్, జూన్ 3 : మంచిర్యాల పట్టణంలోని మేదరివాడకు చెందిన పూస లక్ష్మి(55)ని బంగారం కోసం పథకం ప్రకారమే హత్య చేశారని డీసీపీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. తన ఇంట్లోనే దారుణంగా హత్య చేసిన మంచిర్యాల కాలేజ్‌రోడ్డుకు చెందిన మండలి నరేశ్, హైదరాబాద్‌కు చెందిన అత్తినారపు అలివేలును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ మేరకు మంగళవారం డీసీపీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2024, నవంబర్ 27న మేదరివాడకు చెందిన కూసి లక్ష్మిని గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేసినట్లు తన అక్క, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలానికి చెందిన దినవేణి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం మధ్యాహ్నం పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, మంచిర్యాల కాలేజ్‌రోడ్డుకు చెందిన మండలి నరేశ్, హైదరాబాద్‌కు చెందిన అత్తినారపు అలివేలు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని పట్టుకొని విచారించారు. నరేశ్ హైదరాబాద్‌లో బార్బర్‌గా పని చేసుకుంటూ జల్సాలకు అలవాటుపడ్డాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పూస లక్ష్మి, ఒంటరిగా ఉంటున్నదని, తన వద్ద పెద్ద మొత్తంలో డబ్బు, బంగారం ఉన్నదని తెలుసుకున్నాడు. ఎలాగైనా హతమార్చి దొంగిలించాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయాన్ని తాను సహజీవనం చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన అత్తినారపు అలివేలుకు చెప్పాడు. అందుకు ఆమె కూడా ఒప్పుకున్నది. పథకం ప్రకారం 2024, నవంబర్ 26న లక్ష్మిని హత్య చేసేందుకు ప్రయత్నించారు. విఫలమవడంతో మరుసటి రోజు సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్లి, గొంతు నులిమి హత్యచేశారు. బంగారు, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్ తీసుకొని, పారిపోయినట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసినట్లు డీసీపీ వివరించారు. వారి నుంచి తులం నక్లెస్, తులం చెవి కమ్మలు, 20 తులాల వెండి పట్టీలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు, నేరస్తులు బ్యాంక్‌లో తాకట్టు పెట్టిన 2 తులాల నల్లపూసల తాడు రికవరీ చేయాల్సి ఉందన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి, నేరస్తులను పట్టుకున్న అధికారులు, సిబ్బందిని డీసీపీ అభినందించి రివార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు, ఎస్ఐలు కిరణ్‌కుమార్, చందా తిరుపతి, సీసీఎస్ ఎస్ఐ మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుడి హత్య?

కాగజ్‌నగర్, జూన్ 3 : కాగజ్‌నగర్ మండలం సీబాబు కాలనీ పెద్ద వాగు సమీపంలో మంగళవారం సయ్యద్ దావూద్ (18)ను గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో బాది హత్య చేసినట్లు తెలిసింది. కాగజ్‌నగర్ పట్టణంలోని ఇందిరా మార్కెట్‌కు చెందిన యునికుడిగా గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు. ఈ ఘటనపై రూరల్ సీఐ శ్రీనివాస్‌ను సంప్రదించగా, విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తానని స్పష్టం చేశారు.

## టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నస్పూర్, జూన్ 3 : టెన్త్ క్లాస్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో గల పరీక్షా కేంద్రంలో మొదటి రోజు పరీక్షకు 167 మందికి గాను, 133 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందని పేర్కొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

నస్పూర్, జూన్ 3 : మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దేవానంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో రెండేళ్ల కోర్సులైన ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మన్ సివిల్, డిజిల్ మెకానిక్‌తో పాటు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో అడ్వాన్స్‌డ్ సీఎన్సీ మ్యాచింగ్ టెక్నీషియన్, బేసిక్ డిసిగ్నేర్ అండ్ వర్చ్యువల్ వెరిఫైర్ (మెకానికల్), మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికల్, ఏడాది కోర్సులు ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమెషిన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నిషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జన్నారం, జూన్ 3 : జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామ సమీపంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను మొదటి దశ ఐటీఐ, ఏటీసీ ప్రవేశాల కోసం అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ బీ రాములు తెలిపారు. 21వ తేదీలోగా nitps//iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

శ్రీరాంపూర్, జూన్ 3 : శ్రీరాంపూర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. 21లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆగస్టు 1 నాటికి 14 ఏళ్లు నిండి, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఐటీఐలో కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్‌లో 1 యూనిట్, ఏడాది కోర్సులో 48 సీట్లు, మెకానిక్ డిజిల్ 1 యూనిట్ ఏడాది కోర్సులో 24 సీట్లు, డ్రాఫ్ట్‌మన్ సివిల్ 1 యూనిట్ రెండేళ్ల కోర్సులో 24 సీట్లు ఉన్నాయని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు నిజ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## బెల్లంపల్లి క్లస్టర్ ఏఈవోగా తిరుపతి

బెల్లంపల్లి, జూన్ 3 : బెల్లంపల్లి క్లస్టర్ ఏఈవోగా చొప్పదండి తిరుపతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌సర్వీస్ కోటాలో పొలాస వ్యవసాయ కళాశాలలో నాలుగేళ్ల బీఎస్సీ వ్యవసాయ విద్య పూర్తిచేసుకున్న తిరుపతి విధుల్లో చేరారు. ఒప్పంద ప్రాతిపదికన విధులు నిర్వర్తించిన అంజలి ఒప్పందం మంగళవారంతో ముగిసింది. ఏఈవో మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సాగులో సలహాలు, సూచనలు అందిస్తానని వెల్లడించారు.



తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న రైతు తిరుపతి

## భూ భారతి సదస్సుకు ఒకే ఒక్కడు

హాజీపూర్, జూన్ 3 : కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పేరిట మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులను ప్రారంభించింది. వీటిలో అధికారులకు రైతులు తమ సమస్యలను విన్నవించారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని నంనూర్ గ్రామంలో కూడా మంగళవారం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఐదుగురు అధికారులు, ఇద్దరు పోలీసులు హాజరవగా.. ఒకే ఒక్క రైతు దొమ్మటి తిరుపతి వచ్చి తమ సమస్యను విన్నవించాడు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండేకు తమ పట్టాదారు పాస్‌బుక్‌లో తప్పులను సవరించాలని దరఖాస్తుల చేసుకున్నాడు.


నమస్తే తెలంగాణ CLASSIFIED

**CHANGE OF NAME**

I, PREMALATHA ALUGUVELLI, W/o. THIRUPATHI REDDY ALUGUVELLI, H.No. 3-407/9-1, Hitech Colony, Road No-13, Near ACC Colony, Mancherial. I have changed my name from PREMALA ALUGUVELLI to PREMALATHA ALUGUVELLI.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677


## జిల్లాల్లో భూ భారతి సదస్సులు

తాండూర్/సీసీసీ నస్పూర్/జన్నారం/కెరమెరి/చెన్నూర్ రూరల్/వేమనపల్లి/దహెగాం/దండేపల్లి/బెజ్జూర్, జూన్ 3 : మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. తాండూర్ మండలం కొత్తపల్లి జీపీ పరిధి పెగడపల్లిలో తహసీల్దార్ జ్యోత్స్నతో కలిసి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించారు. అంతకుముందు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. 20 మందికి మంజూరు పత్రాలు అందజేశారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. నస్పూర్ పట్టణంలోని తాళ్లపల్లి పునరావాసకాలనీలో తహసీల్దార్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో.., జన్నారం మండలం రేండ్లగూడ, రాంపూర్ గ్రామాల్లో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, డీటీ రామ్మోహన్ ఆధ్వర్యంలో.., కెరమెరి మండలం జోడేఘాట్, బాబేఝరిలో తహసీల్దార్ భూమేశ్వర్, కేలి(బీ)లో డీటీ గోడం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో.., చెన్నూర్ మండలం బావురావుపేట, ఆస్నాద్ గ్రామాల్లో తహసీల్దార్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో.., వేమనపల్లి మండలం జక్కెపల్లి, మామడ గ్రామాల్లో నాయబ్ తహసీల్దార్ సాయికృష్ణ ఆధ్వర్యంలో.., దహెగాం మండలంలోని బీబ్రా, దహెగాం గ్రామాల్లో తహసీల్దార్ మునవర్ షరీఫ్ ఆధ్వర్యంలో.. దండేపల్లి మండలం తానిమడుగు, బిక్కనగూడ గ్రామాల్లో తహసీల్దార్ రోహిత్‌దేశ్‌పాండే, డీటీ విజయ ఆధ్వర్యంలో.., బెజ్జూర్ మండలం అంబఘాట్ (రెవెన్యూ) జీపీలో తహసీల్దార్ రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్, జూన్ 3 : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోహైల్‌ఖాన్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందించారు. రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కార్మికులు ఇంటి అద్దె చెల్లించలేక, పిల్లల చదువులు ప్రారంభమవనున్న నేపథ్యంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వేతనాలు విడుదల చేయాలని, లేకపోతే ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. నాయకులు లింగయ్య, సాగర్, లింగయ్య, బాపు, మల్లయ్య, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

నస్పూర్, జూన్ 3 : ప్రభుత్వం మంచిర్యాల జిల్లాలో ఫీజుల నియంత్రణ చట్టం, విద్యాహక్కు చట్టం అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం డీఈవో యాదయ్యకు వినతి పత్రం అందించారు. జూన్ 12 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నదని, కానీ ఇప్పటి వరకు పాఠశాలల్లోని సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేస్తామని ప్రకటించి, ఇప్పుడు కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. నాయకులు సికిందర్, కార్తీక్ పాల్గొన్నారు.

## రెగ్యులర్ చేయాలి

కౌటాల, జూన్ 3 : ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్ట్ వొకేషనల్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. 20 ఏళ్లుగా కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో బోధిస్తున్నట్లు, గత ప్రభుత్వం కొంత మందిని రెగ్యులర్ చేసినప్పటికీ తమను మాత్రం ఇప్పటి వరకు రెగ్యులర్ చేయకపోగా ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. నిరసన తెలిపిన వారిలో వొకేషనల్ అధ్యాపకులున్నారు.

## విత్తనాల పంపిణీ

నమస్తే నెట్‌వర్క్, జూన్ 3 : నాణ్యమైన విత్తనం–రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని రైతు వేదికలు, కార్యాలయాల్లో అభ్యుదయ రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధి గుడిపేట రైతువేదికలో మంచిర్యాల జిల్లా వ్యవసాయశాఖ అధికారి కల్పన, ఏడీఏ అనిత.., కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు.., జన్నారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో జిల్లా నోడల్ అధికారి వై ప్రవీణ్‌కుమార్.., దహెగాం మండల కేంద్రంలో వ్యవసాయ శాస్త్రవేత్త తిరుపతి, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ.., తాండూర్ మండలం కొత్తపల్లిలో మండల వ్యవసాయాధికారి సుష్మ.., వేమనపల్లి రైతు వేదికలో శాస్త్రవేత్త నాగరాజు, వ్యవసాయాధికారి వీరన్న.., దండేపల్లి మండలం ద్వారకలో ప్రొఫెసర్ సత్యనారాయణ, ఏవో అంజిత్‌కుమార్.., కౌటాలలో ఎంఏవో పెండోర్ ప్రేమలత.., కన్నెపల్లి, భీమినిలో వ్యవసాయాధికారులు సాయి ప్రశాంత్, యమునదుర్గ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింగరావు.., కాసిపేట మండలం ముత్యంపల్లిలో జిల్లా నోడల్ అధికారి శ్రీకాంత్.., మందమర్రి మండలం సండ్రోన్‌పల్లిలో జగిత్యాల వ్యవసాయ శాస్త్రవేత్త మధుకర్, ఏవో కిరణ్మయి.., తిర్యాణి మండలం చింతపల్లిలో ప్రాంతీయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త బలరాం..,రెబ్బెనలో పీఏసీఎస్ ఛైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, ఏవో దిలీప్‌కుమార్.., కెరమెరి మండలం కెస్లాగూడలో కృషి విజ్ఞాన శాస్త్రవేత్త శివ కృష్ణతో కలిసి ఏడీఏ వెంకటి విత్తనాలు పంపిణీ చేశారు.

## హింధువులపై దాడిచేసిన వారిని శిక్షించాలి

మంచిర్యాల అర్బన్, జూన్ 3 : సిద్దిపేట జిల్లా కేంద్రంలో కొందరు ముస్లింలు గోవుల అక్రమ రవాణా, గోవధ నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు మెదక్ విభాగ్ కార్యదర్శి గ్యాదరి రాజారాం, 14 మంది హిందువులు అడ్డుకుంటే వారిపై విచక్షణా రహితంగా దాడులు చేశారని, వారిని కఠినంగా శిక్షించాలని హిందూ సంఘాల ఐక్యవేదిక కార్యదర్శి కర్ణ కంటి రవీందర్, రాష్ట్రీయ హిందూ పరిషత్ లీగల్ అడ్వైజర్ కొట్టినటేశ్వర్ డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాజారాంకు ఎలాంటి హాని తలపెట్టినా పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ కోశాధికారి బైరి విష్ణు దాస్, సందేశ్‌గుప్తా, శివాజీ సేనఉదేయ్, శ్రీకాంత్, సంతోష్, బద్రి నారాయణ, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్డీవోకు వినతి

రెబ్బెన, జూన్ 3 : గోలేటి జీపీలో సింగరేణి విస్తరణ కోసం సేకరిస్తున్న భీమన్న ఆలయం వద్ద గల 59 ఎకరాల భూమిలో నష్టపరిహారం నిలిపివేసి, అవార్డు రద్దు చేయాలని ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుకు మంగళవారం వినతిపత్రం అందించినట్లు రైతులు తెలిపారు. రైతులందరికీ న్యాయం చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

## బీమా చెక్కు అందజేత

లక్సెట్టిపేట, జూన్ 3 : మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన గోర్ల లింగన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, జెండా వెంకటాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఆయన పంట రుణం తీసుకోగా, అతడి పేరిట ఇన్సూరెన్స్ ఉండడంతో రూ.2 లక్షలు మంజూరైంది. మంగళవారం ఛైర్మన్ తిప్పని లింగయ్య లింగన్న భార్య మల్లవ్వకు చెక్కు అందజేశారు. వైస్ చైర్మన్ కాసు సురేశ్, డైరెక్టర్ వెల్పు శ్రీకర్, ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ పంకజ్, సీఈవో విష్ణువర్ధన్ రావు, పీఏసీఎస్ సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాతో సర్వ రోగాలు నయం

కౌటాల, జూన్ 3 యోగాతో సర్వరోగాలు నయం చేసుకోవచ్చని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. మండలంలోని మినీ స్టేడియంలో మంగళవారం ఏర్పాటు చేసిన యోగా ధ్యాన శిబిరం ప్రారంభ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. నిత్యం కనీసం 40 నిమిషాలు యోగా చేయడం వల్ల మనలోని ధీర్ఘకాలిక వ్యాధులకు చెక్ పెట్టడంతో పాటు కొత్త రోగాలు ధరిచేరకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కౌటాల సీఐ ముత్యం రమేశ్, ఎంపీడీవో బుద్ధే రమేశ్, కార్యదర్శి సాయికృష్ణ, జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చంద్రశేఖర్, చైర్మన్ వరలక్ష్మి జాడే, అధ్యక్షుడు డొంగ్రే సురేశ్, పతాంజలి యోగా జిల్లా అధ్యక్షుడు రవీందర్ గౌడ్, ట్రెజరర్ రఘురాం, యోగా గురువు దాసరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీసీ నస్పూర్, జూన్ 3 : నిత్యం వాకింగ్ చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయుష్ యోగా మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ పద్మజ పేర్కొన్నారు. నస్పూర్‌లో యోగా వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా శిక్షకులు సుధాకర్, మేఘన, కిషన్, డాక్టర్ వెంకటేశ్, ఆయుష్మాన్ వైద్యులు పాల్గొన్నారు.

కన్నెపల్లి, జూన్ 3 : యోగాతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఇన్‌స్ట్రక్టర్లు చౌక్కయ్య, రజిత పేర్కొన్నారు. కన్నెపల్లిలో యోగా వాక్ నిర్వహించారు. ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మందమర్రి, జూన్ 3 : ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మందమర్రి పట్టణంలో యోగా వాక్ నిర్వహించారు. స్థానిక పెట్రోల్ బంక్ వద్ద ప్రారంభించగా, యోగా నినాదాలతో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు సాగింది. మందమర్రి ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ నీరజ, యోగా శిక్షకులు రామ్మోహన్, శైలజ, కొంపెల్లి రమేశ్ కుమార్, రజిత, నాయకులు సొతుకు సుదర్శన్, రాంటెంకి దుర్గరాజ్, వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు వడ్లకొండ కనకయ్య గౌడ్, సభ్యులు నకోటి వెంకటేశ్వర్లు, మార్కండేయ, బింగి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## భద్రతా నిబంధనలు పాటించాలి

మందమర్రి, జూన్ 3 : సింగరేణి ఉద్యోగులందరూ పని స్థలాల్లో విధిగా భద్రతా నిబంధనలు పాటించాలని బెల్లంపల్లి రీజియన్ జీఎం(సేఫ్టీ) రఘుకుమార్ సూచించారు. మందమర్రి ఏరియాలోని కేకేఓసీపై మంగళవారం ఈ నెలలో ప్రమాదాల నివారణకు నిర్వహించిన భద్రతా అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రమాదాల నివారణపై రీజియన్‌లోని అన్ని గనులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో రవీందర్, మేనేజర్ రామరాజు, ఇంజినీర్ వెంకట వంశీధర్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మర్రి కుమారస్వామి, సీఎంవోఏఐ అధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

## పుస్తకాలు అందుబాటులో ఉంచాలి

కెరమెరి, జూన్ 3 : పాఠశాలలు తెరిచేనాటికి ప్రతి విద్యార్థి చేతిలో పుస్తకం అందుబాటులో ఉండేలా చూడాలని కెరమెరి ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. ఎమ్మార్సీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల ఆయా పాఠశాలలకు మంజూరైన పుస్తకాలను ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ జరిగేలా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని, ప్రతి గ్రామంలోని తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాల పనితీరు, సౌకర్యాలపై వివరించాలని చెప్పారు.

## నాణ్యమైన విద్య సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 3 : ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ ఎంఈవో సుభాష్ అన్నారు. మండలంలోని ఇప్పల్ నవేగాం, తెనుగుగూడ గ్రామాల్లో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం అడ్మిషన్ల కోసం ప్రచార జాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఊషన్న, ఉపాధ్యక్షుడు ఇందురావ్, కార్యదర్శి హేమంత్ షిండే, కోశాధికారి రమేశ్, నాయకులు సలీం పాల్గొన్నారు.